# జనం

శ్రీదేవి నివాస్ - రాజుల భోజనం హోటల్.

ఆ పాకలో నిలబడి గుమ్మానికెదురుగా చూస్తే వచ్చీపోయే లారీల రద్దీతో గ్రాండ్ నేషనల్ ట్రంక్‌రోడ్డు, ఎడంపక్కకి తిరిగి చూపుల్ని కిందికి దింపితే కేవలం ఇసక, పిచ్చి మొక్కలూ తప్ప మరేంలేని ఏలేరు, వాకిట్లోకొచ్చి రెండడుగులు ముందుకేస్తే ఏటివంతెన కవతల ఓ వంద గడపల పల్లె, ఆ పల్లెకి పెట్టిన కిరీటంలా వెంకన్నబాబు గుడి.

ఎరకమ్మ చేతిలో గరిటనక్కడే వదిలేసి వెనక గుమ్మంలోంచి ఏటి గట్టెక్కి గుడి గోపురానికోసారి చేతులు జోడించి, చెంపలేసుకుని పాకలోకి పరుగెత్తుకొచ్చింది. కాలూ చెయ్యీ ఆడనట్టైంది. కంగారుతో కళ్లలోకి నీళ్ళు ఎగదన్నుకొచ్చినై. ఏం చెయ్యాలో పాలుపోక ఒక నిముషం అక్కడక్కడే గిన్నెల మధ్యన తచ్చాడింది. చివరికి వంటగది గుమ్మానికట్టిన తెరలోంచి మొహం ఒక్కటే బైటికి పెట్టి "యాండోయ్; మాట, ఇలాగ రా..." అంది తడబడుతూ.

అప్పుడే ఏటి చెలమలో మునిగొచ్చి, తడితువాలుతోనే అగరొత్తు వెలిగించి విఘ్నేశ్వరుడికీ, లక్ష్మిదేవికీ, వెంకటేశ్వర స్వామికీ, సాయిబాబాకీ పేరుపేరునా పొగ తిప్పుతున్న సత్తిరాజు 'ఏంటంత కంగారు?' అన్నట్టు తల తిప్పిచూసేడు.

ఎరకమ్మ తెల్లని మొహంలోకి రక్తమంతా ఎగజిమ్ముకొచ్చినట్టు అన్పించింది. ఏంకొంప మునిగిందోనని చేతిలో పనిని తొందరగా ముగించి, అగరొత్తుని టేబులుమీదున్న కుండెలో గుచ్చి గబగబా వంటింట్లోకి నడిచేడు.

"మన సిరిదేవి పెద్దపిల్లైందండే" అంది ఎరకమ్మ కళ్లల్లో ఊరుతున్న నీళ్లని పైట చెంగుతో ఒత్తుకుంటూ.

పూర్తిగా విన్పించుకోకుండానే "శ్రీదేవి కేవైంది?" కంగారుపడి పోయాడు సత్తిరాజు. పిల్లఎక్కడుందోనని చుట్టూ చూస్తూ, ఎరకమ్మ నవ్వింది, "ఏటైపోనేదు, నీకూతురు సమర్తైంది" అంది. ఇంటెనక చెట్టుకింద బిక్కుబిక్కుమని నిలబడ్డ పిల్లనోసారి కళ్లారా చూసుకొచ్చి,

బీడీ వెలిగించి టేబుల్ ముందున్న కుర్చీలో చతికిలబడ్డాడు సత్తిరాజు. మొన్నమొన్నపుట్టి ఇంకా తన చేతుల్లో ఆడుకుంటున్నట్టే అన్పిస్తున్న శ్రీదేవి అప్పుడే పెద్దదై పోయింది. ఇంకేవుంది. ఇక్కడి పద్ధతి ప్రకారం ఇంక పెళ్ళికెదిగినట్టేలెక్క. ఎవరికిచ్చి చెయ్యాలి శ్రీదేవిని? ఎరకమ్మ కులం వాళ్ళకా, తనకులం వాళ్ళకా? పదిహేను ఇరవై ఏళ్లక్రితం లేని కులం పట్టింపులు ఈ మధ్య కాలంలో ఎక్కువైపోయాయి. సత్తిరాజు ఆలోచన్లు గతంలోకి తొంగి చూసేయి.

పదిహేనేళ్ళ క్రితం సంగతి - పొట్టగడవక కోనసీమ నుంచి చింతపండు వ్యాపారం కోసం ఏజెన్సీకెళ్లిన సత్తిరాజు బొండుమల్లె పువ్వులాంటి ఎరకమ్మను చూసి మనసు పారేసుకున్నాడు. కోటేరేసిన సత్తిరాజు ముక్కుచూసి మక్కువ పెంచుకుంది ఎరకమ్మ. అటు చుట్టాల్నీ ఇటు పెద్దల్నీ ఒప్పించడానికి పాట్లు పడేకన్నా ఎవరి ప్రమేయం లేకుండా బతకడం ఉత్తమం అని నిర్ణయించుకున్నారిద్దరూ. ఫలితంగా రాత్రికిరాత్రే చింతచెట్టు కింద మావుళ్లమ్మ రాయి ఎదుట పసుపుకొమ్ము కట్టేసాడు సత్తిరాజు. అక్కణ్నుంచి దూరంగా వచ్చేసి రోడ్డుపక్కన భోజనం హోటలు పెట్టుకొని గుట్టుగా బతికేస్తున్నారు.

ఎరకమ్మ ఏనాడూ వంటింటి గుమ్మం దాటి హోటల్లో అడుగుపెట్టదు. ఎరకమ్మ చేతిలో ఏం మహత్యం ఉందోగాని మాంసాహార వంటకాలకి మంచి రుచొస్తుంది.

ఆ ప్రదేశం కొత్తదేం కాదు సత్తిరాజుకి.

కాపురం పెట్టే ముందు తరచుగా సైకిలు మీద అటు ప్రయాణం చేస్తూ ఉండేవాడు. అదే పాకలో ఉండే డబ్బాహోటల్లో టీతాగి వెళ్తూండేవాడు. బిజీ సెంటర్ కావడం వలన అప్పటికే డజనుపైగా పాక హోటళ్ళుండేవి.

ఇది చివరి పాక, అమ్మకాలు సరిగా లేక ఈగలు తోలుకుంటూ ఉండేవాడు ఓనరు. అతన్తో మాట్లాడి ఆ పాకని లీజుకి తీసుకున్నాడు సత్తిరాజు.

ముందుహాల్లో నాలుగు టేబుళ్ళూ, ఎనిమిది బెంచీలూ, గుమ్మం పక్కనే సత్తిరాజు కూర్చునే కుర్చీ, డబ్బుల సొరుగున్న చిన్న టేబులూ ఉంటై. హాలు వెనక వంటిల్లు. కుడిపక్క చూరుని దించి కట్టిన పడగ్గదీ, ఆ గదిలో మంచం, ఇనుపబీరువా తప్ప మరేం లేవు. అలా అని బేంకులో దాచుకున్న డబ్బులూ లేవు.

అక్కడికొచ్చిన కొత్తల్లో వెంకన్నబాబు గుళ్లో పురాణ కాలక్షేపం జరుగుతూంటే ఏం తోచక వెళ్లి కూర్చున్నాడు సత్తిరాజు. 'సంపాదించిన విత్తాన్ని దాన ధర్మాలకి వినియోగిస్తే పుణ్యం పురుషార్థం దక్కుతై' అన్న పురాణం శాస్త్రులు గారి మాట బాగా తలకెక్కిందతనికి. హోటలు వ్యాపారం కాస్త ఊపందుకుని ఆదాయం కన్పించడం మొదలయ్యాకి నెలకోరోజు పౌర్ణమినాడు అన్న సంతర్పణ నియమం పెట్టుకున్నాడు. అతని తల్లి పౌర్ణమినాడు పోయింది.

ఆ రోజంతా ఉపవాసం ఉంటాడతను. జనానికి మాత్రం పిండి వంటల్తో, గడ్డపెరుగుతో తినిపిస్తాడు. మిగతా రోజుల మాటెలా వున్నా ఆ రోజు మాత్రం అతని హోటలు జనంతో కిటకిటలాడిపోతుంది. ఆ రోజంతా అక్కడ లారీలు ఆపి భోజనాలకి దిగిన వాళ్ల దగ్గర డబ్బులు పుచ్చుకోడు. వాళ్లు కాక పాలసైకిళ్ళవాళ్లు, వంతెనకవతలి పల్లెల్లోవాళ్లు, మిగిలిన పాకల్లోని పనివాళ్లు సైతం వచ్చి తిని పోతుంటారు. రాత్రిళ్లు భజన కార్యక్రమం ఉంటుంది. రాత్రంతా జనానికందరికీ టిఫిన్లూ, టీలూ ఏర్పాటుచేసే బాధ్యత మాత్రం ఎరకమ్మది.

ఇదంతా చూసి చూసి ఎరకమ్మ "యాండీ రాజుగారూ! మనదేం ఏలూలచ్చులూ యాపారవా? ఇలాగ 'ఎప్పుడొచ్చిందప్పుడే ఎంకటలచ్మి' సేసేసుకుంటే ఎలాగ, ఎక్కడేసిన గొంగళి అక్కడేలాగుండిపోవా? మనకీ ఒక నలుసుపుట్టింది గదా. దాని పెళ్లీగిళ్లీ మంచీసెడ్డా అన్నింటికీ డబ్బు లేకుండా బండెలాగ నడుస్తాది? కుసింతమీరే ఆలోసించి సూడండి" అందోనాడు భయం భయంగా.

"పిచ్చిదానా, ఏంటే నీచాదస్తం నువ్వూను, మనకెవరున్నారు చెప్పు జనం తప్ప. ఆళ్లకేం తిండి లేక వొస్తున్నారా మనింటి బోయనానికి? మనకున్నది ఒక్కగానొక్క పిల్ల, దానికి కలోకార్యమో జరిగినప్పుడు ఒచ్చి ఎలాగ నిలబడతారో, ఎంత సాయం జేస్తారోచూడు. డబ్బుదేంవుందే, ఈవేళ సంపాయిత్తాం, రేపు కర్చు చేస్తాం, జనం ఎలాగొస్తారు?" అని క్లాసు తీసుకున్నాడు సత్తిరాజు.

ఏడోరోజు కూతురి స్నానానికి ఘనంగా ఏర్పాట్లు చేయించేడు. ఇంటి ముందు పందిరేయించి ముందురోజే రంగు రంగుల దీపాలు తోరణాలు కట్టించేడు. మైకులో పాటలు పెట్టించేడు. ఎరకమ్మని కూడా పెట్టుకుని ఇంటింటికీ వెళ్లిపిలిచొచ్చేడు.

ముత్యాలమండపం కట్టించి దాన్లో సింహాసనం లాంటి కుర్చీ వేయించేడు. పేరంటాళ్లకి స్టీలు ప్లేట్లు, కొబ్బరి బొండాలూ పెట్టి తాంబూలాలకి తయారు చేయించేడు. నవకాయ పిండివంటలూ నాలుగుకూరల్తో అన్నీ సిద్ధం చేసి జనం కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

మధ్యాహ్నం పన్నెండు దాటింది. ఒంటి గంటైంది, రెండైంది. పాకల్లో పనిచేసే కుర్రాళ్లు మాత్రం ఓపాతిక మందిదాకా వచ్చి భోజనాలు చేసి, రూపాయో అర్ధో పిల్లచేతిలో పెట్టేసి వెళ్ళేరు. పాలసైకిళ్లవాళ్లు గానీ, పల్లెల్లో జనం గానీ, పరిచయస్థులుగానీ ఇటువైపు ఒంగీ తొంగీ చూడలేదు.

వంటైందని పిలవడానికెళ్లిన పని కుర్రాడితో "ఆళ్ళ కులవేంటో గోత్రవేంటో తెలీదు. ఆళ్ళింటి శుభకార్యానికెలాగొత్తాం" అన్నారట పల్లెల్లో జనం.

సాయంకాలం అరైంది. లోపల్లోపల కుమిలిపోవడం తప్ప ఏనాడూ సత్తిరాజుకి సలహా చెప్పడానికి సాహసించని ఎరకమ్మ తెగించి హోటల్లో కొచ్చింది. టేబులు మీద తలవాల్చి దిగులుగా దిక్కులు చూస్తున్న సత్తిరాజుకి కళ్ల ముందు పదివేల అప్పు కన్పిస్తోంది. అతని నమ్మకం వమ్మైపోయిన దెబ్బ అతని కళ్లల్లో స్పష్టంగా కన్పిస్తోంది. కన్నీళ్లొక్కటే తక్కువైన అతని మొహాన్ని రెండు చేతుల్తో పైకెత్తి ఎరకమ్మ ఇలా అంది - "చూసేవయ్యా నీజనాన్ని? నువ్వొత్తినే వడ్డించినన్నాళ్లూ ఎగబడితిన్నారు. ఇయేళ నీ ఇంట్లో కార్యం అనే పాటికి పిల్ల చేతిలో తుణావోపణావో పెట్టబడద్దని మొకం చాటేసేరు. ఇదే నువ్వు ఏలూ లచ్చలూ సంపాదించి, ఓ మేడ కట్టించి, పదెకరాల మాగాణి సంపాదించుంటే నీ కులంగోత్రం ఎవడికీ అక్కర్లేదు. చేదస్తం నాక్కాదయ్యా నీకు. లెగు లెగు. ఎందుకు దిగులు? మనం అన్నం అమ్ముకునీవోళ్లమే గాని పారబోసుకునీ వోళ్లం గాదు. రాత్రి బోయనాలకింకా ఏళమించిపోలేదు. పోనీలే, ఇదీ మనమంచికే జరిగింది. జనమంటే ఏటో నీకు తెలిసొచ్చింది".

ఆ మాటలు విన్నాక సత్తిరాజు కళ్లల్లోకి వెలుగొచ్చింది. గుండెల్లోకి ధైర్యం వచ్చింది.

గబగబా బైటికెళ్లి అక్కడ 'ఈ రోజు సెలవ్' అని రాసున్న బోర్డు తెచ్చి లోపల పెట్టేడు. లోపల్నుంచి ఇంకో బోర్డు పట్టుకెళ్లి బైట పెట్టొచ్చేడు. దాని మీద ఇలా రాసుంది - "భోజనం తయార్"

*(విశాఖ ఆలిండియా రేడియో సౌజన్యంతో)*

*ఆహ్వానం, జూలై 1997*